## క్లుప్తంగా

### నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు ఎస్ఎండీ షరీఫ్, ఎస్‌డీ ఖాజా ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లీటర్ నూనె రూ.190, కేజీ బియ్యం రూ.72 ఉండడంతో సామాన్య ప్రజలు ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. గతంలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక ధరల పెరుగుదలకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూనెల దిగుమతి సుంకం శాతం పెంచుకోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుమతిస్తే అందుకు టీడీపీ మద్దతు ఇవ్వడం తగదన్నారు.

### స్వీయరక్షణపై దృష్టిపెట్టాలి

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో మహిళలు, విద్యార్థినులు తమకు తాముగా స్వీయరక్షణ కల్పించుకోవాలని ఏపీ గ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక బాలికల వసతి గృహంలో నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. రోజూ ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు జరుగుతున్నా అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ పాల్గొన్నారు.

### నగరపాలకలో నేడు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు ఆర్జీల రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### మానవతా సంస్థ సేవలు అభినందనీయం

కర్నూలు కల్చరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థతో విడదీయరాని అనుబంధం ఉందని డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి అన్నారు. వీఆర్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ.. మానవతా సేవలు ప్రశంసనీయమన్నారు. ఇందులో తాను సభ్యుడిగా ఉండటం గర్వంగా ఉందన్నారు. ప్రతి వ్యక్తి ప్రకృతిని ప్రేమించాలని, సహజ వనరులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు సంవత్సరాలు డ్వామా పీడీగా అమర్‌నాథ్‌రెడ్డి సంస్థకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. మానవతా యూనిట్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పాటిల్ హనుమంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రోగ్రాం కమిటీ చైర్మన్ యుగంధర్‌శెట్టి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవతా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి హరికిషన్, కోశాధికారి రమణ, శేషయ్య, సభ్యులు పాల్గొన్నారు.

### జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏపీటీఎఫ్ 80 వసంతాలు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో మహాసభలు జరగనున్నట్లు చెప్పారు. ఈ సభలకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

### సారా స్థావరాలపై పోలీసుల దాడి



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓర్వకల్లు: మండలంలోని గుమ్మితం తండాలో ఆదివారం నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నామని ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

# ఆరోగ్యకర జీవనశైలితో గుండెజబ్బులు దూరం

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో యువతలో గుండె జబ్బులు పెరుగుతున్నాయని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో యువత గుండె సమస్యలతో బాధపడుతున్నట్లు చూస్తున్నామని, వైద్యులు సూచించిన విధంగా పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కార్డియాలజిస్టులు నాగేంద్రప్రసాద్, సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. యువత మద్యపానం, ధూమపానం చేయడం వల్ల గుండె సమస్యలు అధికమవుతున్నాయన్నారు. ఐటీ విభాగంలో పనిచేసే వారు వ్యాయామానికి దూరంగా ఉండటం వల్ల గుండె సమస్యలు మరింత పెరుగుతున్నాయని చెప్పారు. శరీరానికి తగిన వ్యాయామం అవసరమని తెలిపారు. సీఈఓ డాక్టర్ సునీల్ సేపూరి, డాక్టర్ అరుణ, డాక్టర్ పీటర్ ప్రవీణ్, డాక్టర్ ఫరూక్ పాల్గొన్నారు.



ర్యాలీని పురస్కరించుకుని బెలూన్లను ఎగురవేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

**మెడికవర్ హాస్పిటల్‌లో...**

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్టులు డాక్టర్ ఎస్.చైతన్యకుమార్, డాక్టర్ సీఎస్ తేజానంద న్‌రెడ్డి, డాక్టర్ బీఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. యువతలో హృదయ వ్యాధులు పెరుగుతున్నాయని,అధిక కొవ్వు ఆహారం, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, అనారోగ్య జీవనశైలి దీనికి ప్రధాన కారణాలు అని తెలిపారు. ఆరోగ్యకర జీవనశైలి అలవాటు చేసుకోవడం, రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, సరైన నిద్ర వల్ల గుండె వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ మహేశ్వరరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన న్యాయమూర్తులు



కోర్టు ఆవరణలో మొక్కను నాటి నీరు పోస్తున్న జడ్జి కె.మన్మధరావు

కర్నూలు (లీగల్): జిల్లా కోర్టులో జరుగుతున్న న్యాయమూర్తుల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి కె.మన్మధరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, అదనపు జిల్లా న్యాయమూర్తులు జి.ప్రతిభాదేవి, పి.పాండు రంగారెడ్డి, భూపాల్ రెడ్డి కోర్టు ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు.

# ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యు లు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ .మందిరంలో భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజభోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఇస్కాన్ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.



జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు హారతి ఇస్తున్న దృశ్యం



సందేశం ఇస్తున్న రఘునందన సేవక్ ప్రభు

### హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి

కర్నూలు (టౌన్): జిల్లాలో హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ఒలింపిక్ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు కోరారు. స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత నాలుగు సంవత్సరాలుగా హ్యాండ్‌బాల్ అభివృద్ధి కుంటుపడిందన్నారు. అసోసియేషన్ సభ్యులు నూతనోత్సాహంతో హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సువర్ణ క్రీడా సంఘాల ప్రతినిదులు పాల్గొన్నారు.

**తైక్వాండోతో ఆత్మరక్షణ**

ఆత్మరక్షణ క్రీడ తైక్వాండో అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో ఆదివారం తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన ఆమె ప్రతిభ చాటిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. సీనియర్ శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# భరతమాత ఆలయ కమిటీ నియామకం

కర్నూలు కల్చరల్: స్థానిక నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత దేవాలయం నూతన కమిటీని ప్రకటించారు. ఆదివారం ఆలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి అతిథులుగా హాజరై రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చరిత్రాత్మకమైన భరతమాత దేవాలయంలో జరిగే విశేష పూజలు, ఉత్సవాలు, సేవా కార్యక్రమాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించాలని నూతన కార్యవర్గానికి సూచించారు. భరత మాత సేవా సమితి అధ్యక్షులుగా సందడి మహేశ్వర్, కార్యాధ్యక్షులుగా ఎం.రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్వీ నారాయణరెడ్డి, కె.వసుందరమ్మ, కార్యదర్శిగా అయోధ్య శ్రీనివాస్‌రెడ్డి, సహ కార్యదర్శులుగా టి.ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, రామసుబ్బమ్మ, కోశాధికారిగా మల్లెల పెద్దపుల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా జంపాల రాధిక, లావణ్య, శివశంకర్‌రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, భరద్వాజ శర్మను ప్రకటించారు.



అతిథులతో భరతమాత దేవాలయం నూతన కార్యవర్గ సభ్యులు

# నిరంతర సాధనతో పతకాలు ఖాయం



విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సీఐడీ సీఐ నాగేష్‌బాబు

కర్నూలు (టౌన్): నిరంతరం సాధన చేస్తే పతకాలు ఖాయమని సీఐడీ సీఐ నాగేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడిన వారు తదుపరి పోటీలో గెలవడానికి ప్రయత్నం చేయాలన్నారు. 43 కేజీల కేటగిరీలో పీకే సౌమ్య (మొదటి స్థానం ), మౌనిక (ద్వితీయ స్థానం), జ్యోతి (మూడవ స్థానం), 47 కేజీల కేటగిరీలో జి.లత (మొదటి స్థానం), సమీరా (ద్వితీయ స్థానం) కే.సన (మూడవ స్థానం), 52 కేజీల కేటగిరీలో జి.మేఘన (మొదటి స్థానం), రమాదేవి (ద్వితీయ స్థానం), కే.అంజలి (మూడవ స్థానం), 57 కేజీల కేటగిరీలో సుమిత్ర (మొదటి స్థానం), మౌనిక (ద్వితీయ స్థానం) సంధ్య (మూడవ స్థానం)లో నిలిచారు. గెలుపొందిన లిఫ్టర్లకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి లోకేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి బళ్లారికి వెళ్లే రోడ్డులో హంద్రీబ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. దేవనకొండ మండలం వీరంపల్లెకు చెందిన రామాంజనేయులు కోడుమూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. దేవనకొండ మండలం బోదెపాడు గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌పై కోడుమూరుకు వస్తున్నాడు. హంద్రీబ్రిడ్జి సమీపంలో ఎదురెదురుగా రెండుబైకులు ఢీకొన్నాయి. ఇద్దరు బైక్‌లపై వేగంగా వస్తుండడంతో రోడ్డుపై ఎగిరిపడ్డారు. ఇద్దరి తలలకు గాయలయ్యాయి. ఇదే సమయంలో గుంతకల్ నుంచి కోడుమూరు వస్తున్న భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి వారిని చూశాడు. వెంటనే కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో క్షతగాత్రులకు ప్రాణాపాయం తప్పింది.





గాయపడిన రామాంజనేయులు, వెంకటేష్

**బస్టాండ్ సర్కిల్....**

కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడడంతో గోనెగండ్ల మండలం లింగదిన్నెకు గ్రామానికి చెందిన యువకుడు అశోక్ గాయపడ్డాడు. స్థానికులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అశోక్ కోలుకుంటున్నాడు.

# మల్లన్నా.. బది'లీలలు' కనుమా!

- సాధారణ బదిలీలలో శ్రీశైలంపై శీతకన్ను
- బదిలీ 22 మంది.. వచ్చింది నలుగురే
- దేవస్థానంలో కొరవడిన పర్యవేక్షణ




శ్రీశైలంటెంపుల్: అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారుల పాత్ర కీలకం. కాగా తక్కువ సిబ్బందితో రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కష్టసాధ్యమైంది. సాధారణ బదిలీల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం క్షేత్రంపై దృష్టి సారించలేదని తెలుస్తోంది. 'శ్రీశైల దేవస్థానాన్ని అభివృద్ధి చేసి, సకల సౌకర్యాలు, సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఇటీవల సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన చెప్పినట్లుగా బదిలీల విషయంలో జరగడం లేదు. సాధారణ బదిలీలలో భాగంగా శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 22 మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇతర దేవస్థానాల నుంచి నలుగురు ఉద్యోగులనే శ్రీశైలానికి బదిలీ చేసింది. రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత అతిపెద్ద పుణ్యక్షేత్రాల్లో శ్రీశైల దేవస్థానం ఒకటి. శ్రీశైలాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ చిన్నచూపు చూస్తుంది. ప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీలు నిర్వహించింది. ఆ సమయంలో నిబంధనల మేరకు కొంత మంది ఉద్యోగుల పేర్లు మాత్రమే సూచించారు. అటు తరువాత కొందరు అధికారులు కూటమి ప్రభుత్వానికి కొన్ని పేర్లు ఇవ్వడంతో వారిని కక్షపూరితంగా బదిలీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీశైల దేవస్థానం నుంచి 22 మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేశారు. వీరి స్థానంలో ఇతర దేవస్థానాల నుంచి ఒక పర్యవేక్షకులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు తప్ప ఎవరినీ కేటాయించ లేదు. దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఇద్దరు, నలుగురు సహాయ కార్యనిర్వహణాధికారులు ఇతర దేవస్థానాలకు బదిలీ అయ్యారు. ఇద్దరు ఇంజినీర్లు బదిలీ అయితే ఒక్క ఇంజినీర్‌ని మాత్రమే కేటాయించారు. క్షేత్రంలో అన్నదానం, వసతి, గోశాల, ఆలయం, పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగాలకు సహాయ కార్యనిర్వహణాధికారులు ఉంటారు. అయితే, క్షేత్రం నుంచి ఒకేసారి నలుగురు ఏఈఓలు బదిలీ కావడంతో ప్రస్తుతం ఒక్క పారిశుద్ధ్య విభాగానికి మాత్రమే ఏఈఓ ఉన్నారు. మిగిలిన నలుగురు ఇతర దేవస్థానాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇతర దేవస్థానాల నుంచి శ్రీశైలానికి ఒక్క ఏఈఓని కూడా కేటాయించ లేదు.

**సహాయ కమిషనర్‌కు అదనంగా మూడు విభాగాలు**

సాధారణ బదిలీలలో శ్రీశైల దేవస్థానానికి దేవదాయశాఖ ఏఈఓలను కేటాయించకపోవడంతో దేవస్థానంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆయా విభాగాల్లో పరిపాలన కుంటుపడకుండా ఉండాలంటే ఆయా విభాగాలను ఇతర అధికారులకు కేటాయించాలి. క్షేత్రంలో ఉన్న అధికారులకు అదనంగా పలు విభాగాలు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సహాయ కమిషనర్‌కు ఆ పోస్టుతో పాటు రెవెన్యూ, అన్నదానం, ఆలయం మూడు విభాగాలు అదనంగా కేటాయించారు. అలాగే గోశాల శ్రీశైలప్రభ ఎడిటర్‌కు, దేవస్థాన వైద్యశాల పర్యవేక్షణ, మరి కొన్ని ఇతర విభాగాలను శ్రీశైల దేవస్థాన ప్రజాసంబంధాల అధికారికి కేటాయించారు.

# రంగనాథస్వామి ఆలయ ఈఓగా వీరయ్య

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారిగా వీరయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఓర్వకల్లుకు బదిలీ కాగా ఆయన స్థానంలో నంద్యాల జిల్లా గోస్పాడు దేవాలయ సముదాయం నుంచి వీరయ్య బదిలీపై వచ్చారు. నూతన ఈఓ మాట్లాడుతూ దాతలు, గ్రామ ప్రజల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.



### నూతన కమిటీ ఎన్నిక



వ్యవసాయ శాఖ బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీతో సంఘం రాష్ట్ర నాయకులు

కర్నూలు కల్చరల్: వ్యవసాయ శాఖ బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక, సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం కర్నూలులో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, జాయింట్ సెక్రటరీ మల్లేష్, మధుసూదన గౌడ్, ప్రతాప్ నాయుడు పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా చిన్న అయ్యన్న, ఉపాధ్యక్షుడిగా టి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా శివన్న, కోశాధికారిగా వినయ్, మహిళా అధ్యక్షురాలిగా అమృతవాణి, జిల్లా గౌరవాధ్యక్షుడిగా రంగన్నను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జిల్లా నాయకులు మహేష్ యాదవ్, రంగస్వామి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఏపీ గురుకుల విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు సింధూర, అశ్విని

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికై తమ సత్తా చాటుకున్నారు. ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ సామ్రాజ్యం మాట్లాడుతూ పాఠశాలలో 300 మీటర్ల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కె.సింధూర, 200 మీటర్ల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని కె.అశ్వినిలు తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులతో పాటు పీఈటీ ప్రభావతిని ప్రిన్సిపాల్ అభినందించారు.

### మాళ మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి మూల మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పూజారులు స్వామి వార్లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు.

# వద్దని వదిలించుకున్నారు

- వృద్ధురాలిని శ్రీశైలంలో వదలివెళ్లిన కోడలు
- పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం

కర్నూలు(హాస్పిటల్): నవమాసాలు మోసి కన్న బిడ్డను ఆ తల్లి ఎంతో అన్యోన్యంగా పెంచి పోషించి పెద్దవాడిని చేసింది. అయితే కుమారుడు మాత్రం కన్నతల్లిని వృద్ధాప్యంలో ఆదరించలేదు. గిట్టని కోడలు నీకు శ్రీశైలం చూపిస్తాను రమ్మని తీసుకొచ్చి వదిలించుకుని వెళ్లిపోయింది. దీంతో ఆ వృద్ధురాలు అనాథగా మారింది. వివరాలు.. హైదరాబాద్‌లోని సిద్దిపేటకు చెందిన పార్వతమ్మ అనే వృద్ధురాలికి కుమారుడు సుదర్శన్ ఉన్నారు. ఆయన సిద్దిపేటలో ఇడ్లీలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కోడలు మూడు రోజుల క్రితం పార్వతమ్మను శ్రీశైలం చూపిస్తానని తీసుకొచ్చి అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. కోడలు కనిపించకపోయే సరికి అక్కడి నుంచి కర్నూలు బస్సు ఎక్కి బస్టాండ్‌లో దిగింది. ఎక్కడికి వెళ్లాలో తెలియక అక్కడే ఉన్న ఆమెను నాల్గవ పట్టణ పోలీసులు గమనించారు. వివరాలు తెలుసుకుని ఆటో ఎక్కించి పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి పంపించారు. రాయలసీమ సంఘం అధ్యక్షురాలు శకుంతల ఆమెను ఆదరించి ఆశ్రమంలో చోటు కల్పించారు. వృద్ధురాలి కుటుంబీకుల కోసం ఆరా తీస్తున్నారు.



పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలు పార్వతమ్మ

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత



అధికారులతో కలిసి రన్‌వేను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

- ఎయిర్ పోర్టులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్

ఓర్వకల్లు: అక్టోబర్ 1వ తేదీన సీఎం నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నిమిత్తం పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎయిర్ పోర్టును సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పత్తికొండ మండలం, పుచ్చకాయలమాడ గ్రామంలో జరిగే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం హాజరు కానున్నారని చెప్పారు. ఇందులో భాగంగా వాహనాల పార్కింగ్, వీఐ పీల సమావేశం, టర్మినల్ బిల్డింగ్, రన్‌వే, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రోటో కాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని ఎయిర్ పోర్టు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, కర్నూలు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసాచారి, తహసీల్దార్ విద్యా సాగర్, సీఐలు ప్రసాద్, కేశవ రెడ్డి, పవన్ కిశోర్, చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.